సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 6 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.16,500
అనంతపురం మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16,500, కనిష్టంగా రూ.7 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.15
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.15, కనిష్టంగా రూ.9 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,600 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
35.6°/21.8°
జిల్లా పరిధిలో శుక్రవారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

గురువులకు సన్మానం



కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం



పురస్కారం అందుకుంటున్న బీవీ రత్నం

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌ సీపీ కేంద్ర కార్యాలయంలో గురుపూజోత్సవం నిర్వహించారు. వినూత్న పద్ధతులతో బోధన చేస్తూ విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపడంతో పాటు సమాజ హితానికి తమవంతు తోడ్పాటు అందిస్తున్న రాష్ట్రంలోని వివిధ జిల్లాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ స్టేట్‌ కోఆర్డినేటర్‌ సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటక కళను కాపాడుకుందాం

- రాష్ట్ర స్థాయి నాటక పోటీల ప్రారంభోత్సవంలో డీఆర్‌ఓ మలోల



మాట్లాడుతున్న డీఆర్‌ఓ మలోల

అనంతపురం కల్చరల్‌: ప్రాచీన నాటక కళను కాపాడుకుందామని డీఆర్‌ఓ మలోల అన్నారు. అనంత వేదికగా ఐదురోజుల పాటు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి నాటక పోటీలు శుక్రవారం స్థానిక కృష్ణకళామందిరంలో ప్రారంభమయ్యాయి. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్‌ఓ మలోల జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నాటకాలు శతాబ్దాలుగా మనిషికి మానసిక సాంత్వన కలిగిస్తున్నాయన్నారు. సినిమా, టీవీ, మొబైల్స్‌ రాకతో వెనకపడినా.. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో నాటకానికి ఆదరణ ఉందన్నారు. దాన్ని పట్టణాలకు కూడా వ్యాపింపజేయాలన్న ఉద్దేశంతోనే అనంత వేదికగా రాష్ట్రస్థాయి పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆత్మీయ అతిథిగా విచ్చేసిన నగరపాలక సంస్థ అసిస్టెంట్‌ కమిషనర్‌ రంగస్వామి, న్యాయ నిర్ణేతలుగా విచ్చేసిన బాలాజీ నాయుడు, సుబ్రమణ్యం తదితరులు మాట్లాడారు. అనంతరం భగవాన్‌ శ్రీసత్యసాయి నాటకోత్సవ సమితి ఆధ్వర్యంలో తొలిరోజు కర్నూలు వారి జగదేక సుందరి నాటకం ప్రదర్శించారు. కార్యక్రమంలో శ్రీరామరెడ్డి, శ్రీనివాసులు, అస్లాంబాషా పాల్గొన్నారు.

శాంతిమార్గం.. ఆధ్యాత్మిక సౌరభం



హిందూపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ర్యాలీలో మక్కా, మదీనా నమూనాలు



మహమ్మద్‌ ప్రవక్త భువిపై వెలసిన రోజుకు గుర్తుగా ముస్లింలు జరుపుకునే మిలాద్‌–ఉన్‌–నబీ వేడుకలు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. హిందూపురం, కదిరి, పెనుకొండ, ధర్మవరం, పుట్టపర్తి, మడకశిర తదితర పట్టణాల్లో పెద్ద ఎత్తున శాంతి ర్యాలీలు జరిగాయి. మక్కా, మదీనాల నమూనాలతో పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ముస్లిం యువత జెండాలతో నినాదాలతో చేస్తూ ముందుకు సాగారు. మత పెద్దలు మిలాద్‌ ఉన్‌ నబీ పర్వదిన విశిష్టతను వివరించారు. శాంతి ర్యాలీలతో ఆధ్యాత్మిక సౌరభాలు వెల్లివిరిశాయి. – సాక్షి బృందం



కదిరి వేమారెడ్డి కూడలిలో ముస్లింల శాంతి ర్యాలీ



అమరాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

- రూ.300 పెట్టి లాటరీ టికెట్‌ కొంటే రూ.50 వేలు వస్తుందని కొందరు ఆశపెడితే మడకశిరకు చెందిన ఓ ఆటో డ్రైవర్‌ రోజూ 10 సెట్లు (టికెట్లు) కొంటున్నాడు. అతను సంపాదించే మొత్తంలో సగం అంటే రూ.600 లాటరీ టికెట్లకే ఖర్చు చేస్తున్నాడు. ఏ రోజుకారోజు ఈరోజు తప్పక లాటరీ తగులుతుందన్న ఆశతో రోజూ టికెట్లు కొంటూ లాటరీకి బానిసయ్యాడు.
- కదిరికి చెందిన ఒక పండ్ల వ్యాపారి తన భార్య బంగారు ఆభరణాలు సైతం తాకట్టుపెట్టి లాటరీ టికెట్లు కొన్నాడు. లాటరీలో అదృష్టం వరించలేదు. ఆభరణాలు విడిపించుకునేంత డబ్బు లేక చివరకు వాటిని వదులుకోక తప్పలేదు.
- హిందూపురంలో ఓ టీ కొట్టు నిర్వాహకుడు లాటరీ మాయలో పడ్డాడు. రోజువారీ సంపాదన అంతా లాటరీ టికెట్లకే వెచ్చించాడు. అది సరిపోక ఓ వడ్డీ వ్యాపారి దగ్గర రూ.80 వేలు అప్పు చేసి లాటరీ టికెట్లు కొన్నాడు. లాటరీ తగల్లేదు. కానీ ఆ అప్పు ఇప్పుడు వడ్డీతో కలిపి రూ.1.20 లక్షలకు చేరింది.

..ఇలా రోజువారీ కూలీలు..చిరు వ్యాపారులు..చాలా మంది రెక్కల కష్టాన్ని లాటరీ టికెట్లకు వెచ్చిస్తున్నారు. మిగిలిన కాస్తోకూస్తో డబ్బును మద్యానికి ఖర్చు పెడుతున్నారు. ఇంట్లో ఖర్చులకు ఫైనాన్స్‌ వ్యాపారుల వద్ద అప్పులు చేస్తున్నారు. నిరుపేదల జీవితాలను తారుమారు చేస్తున్న ఇలాంటి అక్రమ వ్యవహారాలను పోలీసులు 'మామూలు'గా స్వీకరిస్తున్నారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఎంతోమంది లాటరీ మహమ్మారి బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

లాటరీ లక్కు... జీవితాలు బుక్కు!



జీవితాలను తారుమారు చేస్తున్న లాటరీ

- జిల్లా వ్యాప్తంగా యథేచ్ఛగా అక్రమ లాటరీ దందా
- ఆశతో రెక్కల కష్టాన్ని లాటరీ టికెట్లకు వెచ్చిస్తున్న పేదలు
- అప్పులతో జీవితాలు ప్రశ్నార్థకం
- అధికారులకు తెలిసినా పట్టించుకోని వైనం



కదిరి: ఆశ... మనిషిని ఎంతదాకైనా తీసుకెళ్తుంది.. ఎంతకైనా దిగజారుస్తుంది. క్షణాల్లో కోటీశ్వరులైపోవాలన్న ఆశ జీవితాలను తలకిందులు చేస్తుంది. అయినా మనిషి ఆశా జీవి. అందుకే అదృష్టాన్ని పరీక్షించుకుంటూ ఉంటాడు. ఇలాంటి వారిపై కొందరు లాటరీ వల విసురుతున్నారు. నిరుపేదలు, చిరుద్యోగులు, చిరు వ్యాపారులను ఆశపెట్టి రూ.కోట్లు సంపాదిస్తున్నారు. కానీ వారి మాటలు విని లాటరీ టికెట్లు కొంటున్న 90 శాతం మంది సర్వం కోల్పోయి రోడ్డున పడుతున్నారు.

'కూటమి' రాగానే ఊపందుకున్న దందా

తంగం, నేరం, కుమరన్, విష్ణు, సింగం, లయన్, యాపిల్‌... ఇవన్నీ సినిమా పేర్లు కాదు... పేదల శ్రమను దోచుకుంటున్న లాటరీ కంపెనీల పేర్లు. ఈ జూదంలో ఆటో డ్రైవర్లు, భవన నిర్మాణ కార్మికులు, తోపుడు బండ్ల మీద పండ్లు, కూరగాయలు అమ్ముకునే చిరు వ్యాపారులతో పాటు విద్యార్థులు బాధితులు. అంతిమంగా లబ్ధి పొందేది మాత్రం లాటరీల నిర్వాహకులు, వారికి అండగా ఉన్న పోలీసులు, ప్రజా ప్రతినిధులు. రాష్ట్రంలో ఎప్పుడో నిషేధించిన లాటరీ వ్యాపారం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ ఊపందుకుంది. జిల్లా పోలీస్‌ యంత్రాంగం లాటరీ టికెట్ల అసలు సూత్రధారులను పట్టుకుంటేగానీ పేదలు రోజంతా కష్టపడి సంపాదించిన సొమ్ము ఇంటికి చేరే పరిస్థితి లేదు.

మామూళ్లే రూ.15 లక్షలు!

జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఎక్కువగా లాటరీ దందా నడుస్తున్నట్లు తెలుస్తోంది. అయినా లాటరీ నిర్వాహకులు జిల్లాలోని అన్ని పోలీస్‌ సబ్‌ డివిజన్లలో కలిపి నెలకు మొత్తంగా రూ.7 లక్షలు, ప్రజా ప్రతినిధులకు రూ.8 లక్షలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఎప్పుడైనా తనిఖీలకు వస్తున్నారని తెలిస్తే నిర్వాహకులకు పోలీస్‌ శాఖ నుంచి ముందే సమాచారం అందుతుంది. అప్పుడు మాత్రం లాటరీ టికెట్ల అమ్మకాలు బంద్‌ అయిపోతాయి.

మభ్యపెడుతున్నారిలా...

రూ.150 పెట్టి లాటరీ టికెట్లు కొంటే డ్రా తీసిన నంబర్‌లో నాలుగు అంకెలున్నా... రూ.5 లక్షలు వస్తాయని ఆశపెడుతున్నారు. రూ.35 పెట్టి టికెట్‌ కొంటే రూ.15 వేలు, రూ.70 టికెట్‌కు రూ.35 వేలు, రూ.15 టికెట్‌కు రూ1,000 తగులుతుందని మభ్య పెడుతున్నారు. దీంతో ఎంతోమంది దినసరి కూలీలు, కార్మికులు రోజుకు రూ.300 నుంచి రూ.3 వేల దాకా లాటరీ టికెట్‌లకు ఖర్చు చేస్తున్నారు. ఒకవేళ లాటరీ తగిలినా అందులో కొంత శాతం నిర్వాహకులకు ఇవ్వాల్సిందేనని వారంటున్నారు. నెలలో 20 మందికి కూడా అదృష్టం వరించలేదని తెలుస్తోంది. లాటరీ మహమ్మారిని నిర్మూలించకపోతే పేదలు అప్పులపాలై చివరకు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తడం ఖాయంగా కనిపిస్తోంది. పోలీసులు తక్షణం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పేదల జీవితాలతో ఆటలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే అసాంఘిక కార్యకలాపాలకు గేట్లు ఎత్తారు. ఇసుక, మట్టి, మద్యం, గంజాయి, లాటరీ ఇలా ఏదీ వదలడం లేదు. ప్రతి దాంట్లో అధికార పార్టీ నేతలకు మామూళ్లు అందుతున్నాయి. సంపాదనే ధ్యేయంగా పనిచేసి పేదల జీవితాలను రోడ్డున పడేస్తున్నారు. – ప్రణీత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ

చర్యలు తీసుకుంటాం



జిల్లా వ్యాప్తంగా ఎక్కడెక్కడ లాటరీ టికెట్ల అమ్మకాలు జరుగుతున్నాయో గుర్తించి వెంటనే దాడులు నిర్వహిస్తాం. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తాం. విక్రేతలతో పాటు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటాం. దీని వెనుక ఎంతటివారున్నా వదిలే ప్రసక్తే లేదు. పోలీస్‌ శాఖలోని వారి హస్తం ఉన్నా కఠినంగా వ్యవహరిస్తాం –వి.రత్న, ఎస్పీ

తిరుఓనం.. భక్తజన సంద్రం



జనాభాయి వేషధారణలో చిన్నారి నృత్యం

ప్రశాంతి నిలయం: ఆధ్యాత్మిక ధామం ప్రశాంతి నిలయంలో కేరళ సంస్కృతి ఉట్టిపడింది. రెండు రోజులుగా సాగుతున్న ఓనం వేడుకలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. చివరిరోజు వేలాది మంది కేరళీయులు వేడుకల్లో పాల్గొన్నారు. తమ సంస్కృతి సంప్రదాయాలు చాటుతూ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తిగీతాలు ఆలపిస్తూ వేడుకలు నిర్వహించుకున్నారు. సాయంత్రం కేరళకు చెందిన సత్యసాయి యూత్, బాలవికాస్‌ చిన్నారులు 'పరిత్రానాయ భక్తానాం' పేరుతో సంగీత నృత్యరూపకం నిర్వహించారు. కవయిత్రి జనాభాయి జీవిత చరిత్ర గురించి చక్కగా వివరించారు. అనంతరం వారంతా సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



సంగీత కచేరీ నిర్వహిస్తున్న కేరళ భక్తులు



'పరిత్రానాయ భక్తానాం' నృత్య ప్రదర్శన

గురువులే మార్గనిర్దేశకులు



గురుపూజోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు



ప్రసంగిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్‌

- గురుపూజోత్సవంలో జేసీ అభిషేక్‌ కుమార్‌
- 71 మందికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం

పుట్టపర్తి అర్బన్‌: నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులే మార్గనిర్దేశకులని జాయింట్‌ కలెక్టర్‌ అభిషేక్‌ కుమార్‌ అన్నారు. డాక్టర్‌ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి వద్ద ఉన్న మంగళకర ఎడ్యుకేషన్‌ ట్రస్ట్‌లో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. డీఈఓ కిష్టప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేసీ అభిషేక్‌ కుమార్‌ మాట్లాడుతూ.. ఎవరు ఏ రంగంలో.. ఏ స్థాయికి వెళ్లినా దాని వెనుక గురువుల కృషి ఉంటుందన్నారు. తరగతి గదిలోనే వారు జాతి నిర్మాణానికి పునాదులు వేస్తారన్నారు. అందుకే గురువును దైవంతో సమానంగా చూస్తామన్నారు. ఉపాధ్యాయులు కూడా తమ గురుతర బాధ్యతను గుర్తించి పనిచేయాలన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకుని పిల్లలను గొప్ప విద్యావంతులుగా, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం 71 మందికి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో సర్వశిక్ష ప్రాజెక్టు డైరెక్టర్‌ దేవరాజ్, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు గంగాద్రి, శ్రీనివాసులు, బూక్యా కాలే నాయక్, సోమ్లా నాయక్‌ తదితరులు ఉన్నారు.

గురువులకు అవమానం

గురుపూజోత్సవం రోజున జిల్లా విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను అవమానించారు. కార్యక్రమానికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారు, వారి కుటుంబీకులు, స్నేహితులు తరలిరాగా కనీసం కుర్చీలు కూడా వేయలేదు. దీంతో వారంతా సుమారు 3 గంటల పాటు చెట్లకిందే నిలబడ్డారు. కార్యక్రమ నిర్వహణకు ప్రభుత్వం రూ.లక్ష మంజూరు చేసినా విద్యాశాఖ అధికారులు కనీసం మంచి నీళ్లు కూడా ఇవ్వలేదు. మంగళకర ఎడ్యుకేషన్‌ ట్రస్ట్‌ నిర్వాహకులే 50 మందికి భోజనాలు, బొకేలు, పూలహారాలు సమకూర్చడం విశేషం.

ప్రజాప్రతినిధులకు పిలుపులేదు..

జిల్లా స్థాయి కార్యక్రమానికి ప్రజాప్రతినిధులనూ ఆహ్వానించలేదు. స్థానిక ఎంపీపీ రమణారెడ్డిని, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీనరసమ్మ, స్థానిక సర్పంచ్‌ లక్ష్మీనరసమ్మ, ఎంపీటీసీ మధురిమలను విద్యాశాఖ ఆహ్వానించలేదు. కనీసం ఆహ్వాన పత్రికలో కూడా వారి పేర్లు ముద్రించలేదు. ఇటీవల నియామకమైన కార్పొరేషన్‌ డైరెక్టర్లు, టీడీపీ నాయకులను పిలిచి ప్రజాప్రతినిధులను అవమానించారు.



హాలులో కుర్చీలు లేక బయటే నిల్చున్న పలువురు ఉపాధ్యాయులు, వారి బంధువులు

ఇచ్చింది గోరంత.. నిర్లక్ష్యం కొండంత

ఉచిత మందులకు భారీగా బడ్జెట్‌ కోతలు

- ఇవ్వడమే తక్కువైతే వినియోగంలో అంతులేని నిర్లక్ష్యం
- సర్వజనాస్పత్రిలో దారుణ పరిస్థితులు
- అత్యవసర మందులు లేక అల్లాడుతున్న సామాన్య రోగులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసింది. మందుల బడ్జెట్‌కు భారీగా కోతలు విధించింది. అరకొరగా కేటాయించిన నిధులను వినియోగించడంలో అధికారులు అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి 41 లక్షల మందికి పైగా జనాభాకు పెద్ద దిక్కు అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రి. రోజూ వేలాదిమంది ఇక్కడకు వైద్యం కోసం వస్తుంటారు. అలాంటి ఆస్పత్రిలో ఇప్పుడు మందుల కొరత తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. అత్యవసర మందులు లేక నానా తంటాలు పడుతున్నారు. నిత్యం గర్భిణులు, కాలిన గాయాల బాధితులు, ప్రమాదాల్లో గాయపడిన వారు, కుక్కకాటు, పాముకాటు బాధితులు ఇలా రకరకాల పరిస్థితుల్లో ఉన్నవారు ఇక్కడకు వస్తున్నా.. వారికి సరైన మందులు అందుబాటులో లేకపోవడం వేధిస్తోంది.

డైక్లోఫినాక్‌ ఇంజెక్షన్ల కొరత

ప్రమాదం జరిగి గాయాల పాలైనప్పుడు లేదా హై ఫీవర్‌తో వచ్చినప్పుడు డైక్లోఫినాక్‌ ఇంజెక్షన్లు ఇస్తారు. తక్షణ నొప్పి నివారిణిగా ఇది ఉపయోగిస్తారు. ప్రతిరోజూ కొన్ని వేల ఇంజక్షన్లు అవసరమవుతాయి. కానీ ఇప్పుడు ఏ ఆస్పత్రిలోనూ లేవు. చిట్టీలు రాసిచ్చి బయట తెచ్చుకోవాలని చెబుతున్నారు. కొన్ని ఆస్పత్రుల్లో గ్లౌజులు లేవు, మరికొన్ని ఆస్పత్రుల్లో కాటన్ లేదు. ఏరియా ఆస్పత్రుల్లో ఎక్కువగా ప్రసవాలు జరుగుతుంటాయి. డెలివరీ సమయంలో అవసరమైన మందులు లేవు.

యాంటీబయోటిక్స్‌ మందుల్లేవ్‌

అనంతపురం సర్వజనాస్పత్రిలో యాంటీబయోటిక్స్‌ కొరత తీవ్రంగా ఉంది. ప్రాణాధార మందులుగా చెప్పుకునే యాంటీబయోటిక్స్‌ సెంట్రల్‌ డ్రగ్‌ స్టోర్‌లో అందుబాటులో లేవు. సిఫ్ట్రిమ్, అమాక్సిలిన్, సెఫటాగ్జిమ్‌ వంటి ప్రాణాధార మందులు అయిపోయాయి. ఖరీదైన ఈ మందులను బయట తెచ్చుకోవాలని రోగులకు చిట్టీలు రాస్తున్నారు.



అత్యవసర మందుల కొరత

మందు పేరు	ఏ జబ్బుకు
అమాక్సిలిన్ క్లావిలిక్ యాసిడ్	యాంటీ బయోటిక్
ప్రొపోపాల్ ఇంజెక్షన్	ఆపరేషన్ సమయంలో
మెడజోలిన్ ఇంజెక్షన్	సిజేరియన్ కోతలో వేసే మందు
బూపావ్యాకిన్	అనస్థీషియా కోసం
యాంపిసిలిన్	యాంటీబయోటిక్
సిఫెటాగ్జిమ్	యాంటీబయోటిక్
ఆర్టిసునేట్ 60 ఎంజీ, క్లోరోసిన్ ఫాస్ఫేట్	యాంటీ మలేరియా
మెట్రోనిడజోల్	డయేరియా

అనంతపురం సర్వజనాస్పత్రికి 2024-25లో డ్రగ్స్‌ వివరాలు

మందులకు వచ్చిన బడ్జెట్	రూ.8,80,99,350
మందులకు వెచ్చించినది	రూ.6,91,98,980
మొత్తం బడ్జెట్‌లో వెచ్చించిన శాతం	79
2025-26 తొలి త్రైమాసికంలో వచ్చిన నిధులు	రూ.2,88,32,909
జూలై 16 నాటికి వెచ్చించిన నిధులు	రూ.1,47,45,749
వచ్చిన నిధుల్లో వెచ్చించిన శాతం	51

క్లుప్తంగా

రేపు మధ్యాహ్నం పంపనూరు ఆలయం మూసివేత

ఆత్మకూరు: మండలంలోని పంపనూరు సర్ప రూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి క్షేత్రంలో ఆదివారం మధ్యాహ్నం వరకే పూజాదికాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఈఓ బాబు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం 1 గంట నుంచి ఆలయం తలుపులు మూసి, తిరిగి సోమవారం తెల్లవారుజామున సంప్రోక్షణ కార్యక్రమాలతో తెరుస్తారని పేర్కొన్నారు.

నంది విగ్రహం అపహరణ

- అనుమానం రాకుండా మరొకటి ఏర్పాటు



ఎత్తుకెళ్ళిన స్థానంలో ఉంచిన మరో నంది

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ముష్టికోవెల సమీపంలో ఉన్న పురాతన శివాలయంలో నంది విగ్రహాన్ని గురువారం రాత్రి దుండగులు అపహరించారు. శుక్రవారం ఉదయం పూజలు చేసేందుకు వెళ్లిన అర్చకుడు.. అక్కడ నంది విగ్రహం కనిపించకపోవడంతో వెంటనే స్థానికులను అప్రమత్తం చేశాడు. దీంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పరిశీలించారు. శివలింగానికి ఎదురుగా ప్రతిష్ఠించిన నందిని పెకలించి తీసుకెళ్లడంతో పాటు ఎవరికీ అనుమానం రాకుండా ఆలయం ప్రాంగణంలో ఉన్న మరో నంది విగ్రహాన్ని తీసుకెళ్లి అక్కడ ఉంచారు. గతంలోనూ ఈ ఆలయంలో కొందరు క్షుద్రపూజలు చేసి, చోరీకి ప్రయత్నం చేశారని, గుప్తనిధుల కోసమే నంది విగ్రహాన్ని ఎత్తుకెళ్లి ఉంటారనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై గ్రామస్తులు మూకుమ్మడిగా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రజారోగ్యంతో కూల్‌డ్రింక్స్ ఏజెన్సీ నిర్వాహకుల చెలగాటం



కాలం చెల్లిన కూల్ డ్రింక్ బాటిళ్లను పడేస్తున్న దృశ్యం

హిందూపురం: ప్రజారోగ్యంతో కూల్‌డ్రింక్స్ ఏజెన్సీ నిర్వాహకులు చెలగాటమాడారు. కాలం చెల్లిన కూల్ డ్రింక్ బాటిళ్లను రోడ్డు పక్కన నిర్లక్ష్యంగా పడేయడంతో అటుగా వెళుతున్న వారు, స్థానికులు, చిన్నారులు గుర్తించి కేసులకు కేసులే ఎత్తుకెళ్లారు. చిన్నారులు కొందరు అక్కడే బాటిళ్ల మూతలు తీసి కూల్ డ్రింక్స్ తాగుతూ కనిపించారు. కాగా, కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ విషపూరితంగా మారుతాయని, వాటిని సేవిస్తే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఏజెన్సీ నిర్వాహకులు నిర్లక్ష్యంగా రోడ్డు పక్కన పడేయడం వివాదాస్పదమైంది.



ఇన్‌స్పైర్‌పై కనిపించని ఆసక్తి



- ఈ ఏడాది జూన్‌లో ఇన్‌స్పైర్ మనాక్ ఎంట్రీలకు నోటిఫికేషన్ జారీ
- ఈ నెల 15తో ముగియనున్న దరఖాస్తు గడువు
- జిల్లాలో ఇప్పటి వరకూ 13 నామినేషన్ల నమోదు
- ప్రాజెక్ట్‌ల రూపకల్పనపై ఆసక్తి చూపని ఉపాధ్యాయులు
- అవకాశాలను కోల్పోతున్న ప్రతిభావంత విద్యార్థులు



గతంలో ఇన్‌స్పైర్ మనాక్‌లో భాగంగా జిల్లా విద్యార్థి రూపొందించిన ప్రాజెక్ట్ (ఫైల్)

ప్రశాంతి నిలయం: దేశంలో మేకిన్ ఇండియా లక్ష్యాలను సాధించే క్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇన్‌స్పైర్ మనాక్ కార్యక్రమానికి జిల్లా ఉపాధ్యాయుల నుంచి ఉదాసీనత వ్యక్తమవుతోంది. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించి భవిష్యత్తు శాస్త్రవేత్తలుగా వారిని తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం లక్ష్యం. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులు ఇందులో ప్రాతినిధ్యం వహించవచ్చు. ఇందుకు గాను విద్యార్థులను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సన్నద్ధం చేయాల్సి ఉంటుంది. విద్యార్థుల్లోని సృజనకు పదును పెట్టి ప్రాజెక్ట్‌లను రూపొందించేలా ప్రోత్సహించడం ద్వారా వారిని భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దవచ్చు.

పోటీల నిర్వహణ ఇలా....

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థి దశలోనే ప్రయోగాలను చేసేలా ప్రోత్సహించి నూతన ఆవిష్కరణలకు దోహదపడేలా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శాస్త్రీయ ప్రయోగ పోటీనే ఇన్‌స్పైర్ మనాక్. ప్రతి ప్రాజెక్ట్ రూప కల్పనకు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేస్తారు. జిల్లా స్థాయిలో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్‌లను నీతిఆయోగ్, నేషనల్ ఇన్నోవేషన్ సెంటర్ బృందం పరిశీలించి ఉత్తమ ప్రాజెక్ట్‌లను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేసిన వెయ్యి ప్రాజెక్ట్‌లను జాతీయ స్థాయికి పంపిస్తారు. జాతీయ స్థాయిలో ఎంపికైన ఉత్తమ ప్రాజెక్ట్‌ల రూపకర్తలను విజేతలుగా ప్రకటించి భారత రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందజేయడంతో పాటు విందు ఏర్పాటు చేస్తారు. జాతీయ స్థాయిలో ఎంపికైన ప్రాజెక్ట్‌లను నేషనల్ ఇన్నోవేషన్ సెంటర్ ఆధ్వర్యంలో పారిశ్రామిక సంస్థల ద్వారా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటారు. ఇక్కడ ఆశించిన మేర ఫలితాలు సాధిస్తే ఆ ప్రాజెక్ట్‌ను రూపొందించిన విద్యార్థికే పేటెంట్ హక్కులు కల్పించి, కార్పొరేట్ సంస్థలకు పరిజ్ఞానాన్ని అమ్ముకునే వెసులుబాటు కల్పిస్తారు. అయితే జిల్లాలో ఉపాధ్యాయుల్లో ఆసక్తి లేక ప్రతిభావంత విద్యార్థులు ఉన్నత అవకాశాలను కోల్పోవాల్సి వస్తోంది.

ఆసక్తి చూపని ఉపాధ్యాయులు..

2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు ఇప్పటికే నోటిఫికేషన్ జారీ అయింది. ప్రతి పాఠశాల నుంచి 5 చొప్పున 1,280 ప్రాజెక్ట్‌లను నిర్దేశించిన యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని 256 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఇన్‌స్పైర్ మనాక్‌కు రిజిస్టర్ చేసుకున్నాయి. జూన్ 15న నామినేషన్ల నమోదు ప్రక్రియ ప్రారంభం కాగా ఈ నెల 3 నాటికి జిల్లాలోని కేవలం 3 పాఠశాలలు 13 ప్రాజెక్ట్‌లను మాత్రమే నమోదు చేశాయి. ఈ నెల 15తో గడువు ముగియనుంది. ఈ లెక్కన పరిశీలిస్తే గడువు తేదీ నాటికి కనీసం 50 శాతం లక్ష్యాన్ని కూడా అధిగమించడం కష్టమని తెలుస్తోంది. ప్రతి పాఠశాలలోని సైన్స్ టీచర్ గైడ్‌గా వ్యవహరిస్తూ ప్రధానోపాధ్యాయుడి సహకారంతో విద్యార్థిలోని సృజనకు అనుగుణంగా ప్రాజెక్ట్ రూపకల్పన చేయాల్సి ఉంది. అయితే ఈ విషయంగా ఉపాధ్యాయులు చొరవ చూపకపోవడంతో అందరి అంచనాలు తలకిందలయ్యాయి.

అవగాహన కల్పిస్తున్నాం



ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో పాల్గొనేలా విద్యార్థులను సన్నద్ధులను చేయాలని ఇప్పటికే అన్ని యాజమాన్య పాఠశాలలకు సూచనలు జారీ చేశాం. జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 3 పాఠశాలలకు సంబంధించి 13 ప్రాజెక్ట్‌లు మాత్రమే నమోదయ్యాయి. కనీసం వెయ్యి ప్రాజెక్ట్‌లు పోటీకు సిద్ధం చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. రాబోవు రెండు రోజుల్లో అన్ని పాఠశాలల నుంచి ప్రాజెక్ట్‌లు నమోదవుతాయని అనుకుంటున్నా.

– తనూజ్ కుమార్, జిల్లా సైన్స్ అధికారి

మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- రాష్ట్ర మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం అధ్యక్షుడు నాగభూషణ



మాట్లాడుతున్న నాగభూషణ

పుట్టపర్తి టౌన్: మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 12వ పీఆర్సీ అమలు చేసి కనీస వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం అధ్యక్షుడు నాగభూషణ డిమాండ్ చేశారు. శుక్రవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఆ సంఘం 3వ జిల్లా మహాసభలు జరిగాయి. స్థానిక మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు వెంకటేష్ అధ్యక్షత వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు రామకృష్ణ, నరసింహులు, జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లేబర్ కోడ్ పేరుతో చట్టాలను కుదించి కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు 12 గంటల పని వేళలు పెంచడాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు పైపల్లి గంగాధర్, నాగార్జున, నరసింహులు, రామయ్య, కేశవ, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆయతపల్లిలో విషాదం

- నీటి కుంటలో దిగి 4వ తరగతి విద్యార్థి మృతి
- సరదాగా స్నేహితులతో కలిసి ఓ చిన్న గణపతిని నిమజ్జనం చేస్తుండగా ఘటన



మనోజ్ మృతదేహం

రాయదుర్గం టౌన్: మండలంలోని ఆయతపల్లిలో విషాదం చోటు చేసుకుంది. గణపతి నిమజ్జనం కోసం నీటి కుంటలో దిగిన ఓ బాలుడు బురదలో కూరుకుపోయి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు.. గుమ్మఘట్ట మండలం కొత్తపల్లికి చెందిన మల్లయ్య, జయమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు మనోజ్ (9) చిన్నప్పటి నుంచి రాయదుర్గం మండలం ఆయతపల్లిలోని అవ్వతాతల వద్ద ఉంటూ అక్కడే చదువుకుంటున్నాడు. ప్రస్తుతం నాల్గో తరగతి చదువుతున్న మనోజ్ శుక్రవారం మరో ఇద్దరు స్నేహితులతో కలసి మట్టితో ఓ చిన్నగణపతిని చేశాడు. అనంతరం వారికి తోచిన విధంగా పూజలు చేసి సరదాగా ఆడుకుంటూ పాఠశాల వెనుక ఉన్న కుంటలో నిమజ్జనం చేసేందుకు వెళ్లారు. గణపతి బొమ్మను తీసుకుని కుంటలోకి దిగిన మనోజ్ బురదలో కూరుకు పోతుండగా.. గమనించిన తోటి స్నేహితులు పరుగున గ్రామంలోకి వెళ్లి బంధువులకు సమాచారం అందించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని బాలుడిని వెలికి తీసి రాయదుర్గంలోని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా... అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు.

విత్తన సొమ్ము పక్కదారి!

- ఏపీ సీడ్స్‌కు చెల్లించని ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు
- ఉమ్మడి జిల్లాలో పేరుకుపోయిన రూ.77 లక్షల బకాయిలు
- ఉదాసీనంగా వ్యవవహరిస్తున్న వ్యవసాయాధికారులు



విత్తన వేరుశనగ (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వ ఆధీనంలోని ఏపీ సీడ్స్‌కు చెల్లించాల్సిన విత్తనం సొమ్మును ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు కొందరు సొంతానికి వాడుకున్నారు. పంపిణీ చేసిన రోజు లేదా మరుసటి రోజే ఏపీ సీడ్స్ ఖాతాకు జమ చేయకుండా జాప్యం చేస్తూ వచ్చారు. దీంతో ఏపీ సీడ్స్ ద్వారా ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన సొమ్ము కాస్త పక్కదారి పట్టింది.

రూ.77 లక్షలు బాకీ

ఖరీఫ్‌లో ఏపీ సీడ్స్ ద్వారా 40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ, విత్తన వరి, 50 శాతం రాయితీతో పచ్చిరొట్ట విత్తనాలు (గ్రీన్ మెన్యూర్ సీడ్) రైతులకు పంపిణీ చేశారు. రాయితీ పోనూ రైతులు తమ వాటాగా (నాన్‌సబ్సిడీ) ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లకు రూ.26,93,71,674 చెల్లించారు. ఇందులో ఇప్పటి వరకూ ఏపీ సీడ్స్‌కు 26.61 కోట్లు చెల్లించినట్లుగా రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. మరో రూ.32.54 లక్షలకు పైగా సొమ్ము ఏమైందో అంతుచిక్కడం లేదు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో రూ.35,55,61,081 విలువ చేసే రాయితీ విత్తనాలు పంపిణీ చేశారు. అందులో ఏపీ సీడ్స్‌కు రూ.35.11 లక్షలు మాత్రమే చెల్లించారు. ఇంకా రూ.44.21 లక్షలకు లెక్క తేలాల్సి ఉంది. విత్తన పంపిణీ ముగిసి రెండు నెలలు కావస్తున్నా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.77 లక్షల వరకు ఏపీ సీడ్స్‌కు బకాయిలు పేరుకుపోయాయి. ప్రధానంగా అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లి ఆర్‌ఎస్‌కే ద్వారా రూ.8.11 లక్షలు, వెస్ట్‌కోడిపల్లి ఆర్‌ఎస్‌కే నుంచి రూ.3.69 లక్షలు, ఉరవకొండ మండలం వెలిగొండ ఆర్‌ఎస్‌కే నుంచి రూ.3.05 లక్షలు, కుందుర్పి మండలం అపిలేపల్లి ఆర్‌ఎస్‌కే నుంచి రూ.2.04 లక్షలు, గుమ్మఘట్ట మండలం కలుగోడు ఆర్‌ఎస్‌కే నుంచి రూ.1.82 లక్షలు, కుందుర్పి మండలం బెస్తరపల్లి ఆర్‌ఎస్‌కే నుంచి రూ.1.24 లక్షలు... ఇలా ఏపీ సీడ్స్ సొమ్మును తమ సొంతానికి ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు వాడుకున్నట్లుగా ఆరోపణలున్నాయి. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలోనూ ఓడీసీ మండలం తంగేడుకుంట, మడకశిర మండలం ఎర్రబొమ్మనహళ్లి, రామగిరి మండలం కుంటిమద్ది, తాడిమర్రి మండలం పెద కోట్ల, గాండ్లపెంట మండలం గొద్దువెలగల, ఎన్‌పీ కుంట మండలం ఎదురుదొన, నల్లమాడ మండలం దొన్నికోట–2, అమరాపురం మండలం మద్దనకుంట ఆర్‌ఎస్‌కేల నుంచి రూ.లక్షల బకాయిలు పేరుకుపోయాయి. సొమ్ము చెల్లించకుండా నెలల తరబడి జాప్యం చేస్తున్న ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా వ్యవసాయశాఖ ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- రాష్ట్ర అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ



మహాసభలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

పుట్టపర్తి టౌన్: ఎన్నికల సమయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటూ ప్రభుత్వాన్ని రాష్ట్ర అంగన్‌వాడీ వర్కర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి అధ్యక్షతన 8వ జిల్లా మహాసభలు జరిగాయి. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, జిల్లా శ్రామిక సంఘం అధ్యక్షురాలు దిల్షాద్, అనంతపురం జిల్లా అధ్యక్షురాలు శకుంతల, కార్యదర్శి రమాదేవి పాల్గొని ప్రసంగించారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతన చట్టం అమలు చేయాలన్నారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మార్చాలన్నారు. ఇతర పనులు కేటాయించరాదన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. డిమాండ్ల సాధనకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శ్రీదేవి, ప్రధాన కార్యదర్శిగా పి. శ్రీదేవి, కోశాధికారిగా రంగమ్మ, ఉపాధ్యక్షురాలుగా దిల్షాద్, మహదేవమ్మ, మరో 34 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

బత్తలపల్లి/ ముదిగుబ్బ: బత్తలపల్లి మండల పరిధిలోని ముదిగుబ్బ – చిన్నేకుంటపల్లి రైల్వే స్టేషన్ల మధ్యన జిల్లేడుబండ నది ఆర్‌ఓబీపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గురువారం సాయంత్రం గుర్తించారు. సమాచారం అందుకున్న ధర్మవరం రైల్వే పోలీసులు శుక్రవారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. గురువారం సాయంత్రం 6.30 గంటల సమయంలో సుమారు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా నిర్ధారించారు. శరీరం ఛిద్రమైంది. 5.5 అడుగుల ఎత్తు, చామనఛాయ రంగు, మెరూన్ రంగు టీ షర్టు, నీలం... ఎరుపు రంగు గళ్ల లుంగీ ధరించాడు. ఇంతకు మించి ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యగా కేసు నమోదు చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 89786 56463, 99513 25345కు సమాచారం అందించాలని కోరారు.

తాగుడుకు డబ్బివ్వలేదని..



సంజీవయ్య (ఫైల్)

రాప్తాడు: తాగుడుకు డబ్బు ఇవ్వలేదంటూ ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాప్తాడు మండలం యర్రగుంటకు చెందిన ఉప్పర గౌతమికి రామగిరి మండలం కుంటిమద్ది గ్రామానికి కోడిగ సంజీవయ్య (31)తో 14 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. యర్రగుంటలోనే కాపురం ఉంటున్నారు. అదే గ్రామంలో ఐసీఆర్పీ సంస్థలో గౌతమి ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. మద్యానికి బానిసైన సంజీవయ్య ఎలాంటి పనిపాటా చేయకుండా జులాయిగా మారాడు. ఈ క్రమంలో భార్యపై అనుమానం పెంచుకుని మద్యం మత్తులో తరచూ ఆమెను వేధింపులకు గురి చేస్తూ వచ్చేవాడు. తాగేందుకు డబ్బు ఇవ్వాలని కొట్టేవాడు. పలుమార్లు పెద్ద మనుషులు పంచాయితీ పెట్టి నచ్చచెప్పినా అతనిలో మార్పు రాలేదు. ఈ క్రమంలో ఈ నెల 4న తాగేందుకు డబ్బు ఇవ్వకపోవడంతో మధ్యాహ్నం 12.40 గంటల సమయంలో గడ్డి మందు తాగి బాత్రూమ్‌లో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక గురువారం రాత్రి సంజీవయ్య మృతి చెందాడు. గౌతమి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

తెలంగాణలో.. నల్లమాడ వాసి మృతి

- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



రంగస్వామినాయుడు (ఫైల్)

నల్లమాడ: తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా కడతాల్ బస్టాప్ వద్ద శుక్రవారం ఉదయం చోటు చేసుకున్న ప్రమాదంలో నల్లమాడ మండల వాసి మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామస్తులు తెలిపిన మేరకు... నల్లమాడ మండలం కొండ్రవారిపల్లికి చెందిన జె.రంగస్వామి నాయుడు (57) కొంతకాలంగా తెలంగాణ ప్రాంతంలో మామిడి, జామ తోటల ఫలసాయం కొనుగోలు చేస్తూ పండ్ల వ్యాపారంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆయనకు భార్య ఆదిలక్ష్మి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారం రోజుల క్రితం స్వగ్రామంలో కుమారుడు హరినాయుడు వివాహం జరిపించాడు. పెళ్లి తంతు ముగించుకుని గురువారం రాత్రి రైలులో తన భార్య ఆదిలక్ష్మి, సహాయకుడు నరసపు కిష్టప్పతో కలసి హైదరాబాద్‌కు బయల్దేరిన రంగస్వామి నాయుడు శుక్రవారం తెల్లవారుజామున కాచిగూడ రైల్వే స్టేషన్ చేరుకున్నాడు. అనంతరం తాము నివాసముంటున్న ప్రాంతానికి వెళ్లేందుకు రంగారెడ్డి జిల్లా కడతాల్ బస్టాప్‌కు చేరుకుని బస్ కోసం వేచి ఉండగా... హైదరాబాద్ వైపు నుంచి వేగంగా వచ్చిన దూసుకొచ్చిన కారు ముగ్గురినీ ఢీకొంది. రోడ్డుపై తీవ్ర గాయాలతో పడి ఉన్న ఆదిలక్ష్మి, కిష్టప్పను ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ గుర్తించి ఆస్పత్రికి తరలించాడు. రోడ్డుకు దూరంగా ఎగిరి పడిన రంగస్వామి నాయుడుని గుర్తించలేకపోయాడు. విషయం తెలుసుకున్న అక్కడికి సమీపంలో నివాసం ఉంటున్న నల్లమాడ మండల వాసులు వెంటనే ప్రమాదస్థలానికి చేరుకుని రోడ్డుకు కొంత దూరంలో పడి ఉన్న రంగస్వామినాయుడును గుర్తించి సమాచారం ఇవ్వడంతో స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని క్షతగాత్రుడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక మృతి చెందాడు. కిష్టప్ప పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఆదిలక్ష్మికి రెండు కాళ్లు దెబ్బతిన్నాయని గ్రామస్తులు తెలిపారు. శనివారం రంగస్వామి నాయుడు మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

ఆచార్య దేవోభవ...

గురువు అనే పదానికి వన్నె తెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా 71 మందికి అవార్డులను ప్రదానం చేశారు. శుక్రవారం పుట్టపర్తి లోని మంగళకర ట్రస్ట్ ప్రాంగణంలో అవార్డుల ప్రదాన కార్యక్రమం ఘనంగా సాగింది.



గుట్టూరు హెచ్‌ఎం బండి నాగార్జునుడుని సన్మానిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్, డీఈఓ కిష్టప్ప



శ్రావణి, ఏపీఎంఎస్, ధర్మవరం




పూజారి శ్రీకాంత్, హెచ్‌ఎం, సిద్ధరాపురం



జగదీశ్వర్, హెచ్‌ఎం, బుక్కపట్నం



నౌషద్ అలీ, హెచ్‌ఎం, దేమకేతేపల్లి



కేశవమూర్తి, హెచ్‌ఎం, పూలకుంట



శేషగిరిరావు, హెచ్‌ఎం, చెన్నరాజుపల్లి




నీలిమ, స్పెషలాఫీసర్, కేజీబీవీ, లేపాక్షి



విశ్వనాథ్, హెచ్‌ఎం, బుల్లసముద్రం



సి. మంజునాథ్, హెచ్‌ఎం, పి.బ్యాడిగెర



వెంకటరమణ, హెచ్‌ఎం, పుట్టపర్తి



జగన్నాథం, హెచ్‌ఎం, గొట్లూరు